క్లుప్తంగా

వరికొనుగోలు కేంద్రం ప్రారంభం



కృష్ణా: మండలంలోని హిందుపూర్‌లో బుధవారం ఐకేపీ అధికారులు వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ మేరకు.. ఏపీఎం బస్వరాజు మాట్లాడుతూ.. రైతులు తమ ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని కోరారు. ఈ అవకాశాన్ని రైతులు ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఈఓ మానస, సీసీ అరుణ్, వీఓఏలు శంకరమ్మ, మహేంద్ర, లింగప్ప తదితరులు పాల్గొన్నారు.

నేడు భగవాన్ జయంతి

నారాయణపేట రూరల్ : భగవాన్ శ్రీ సత్యసాయిబాబా జయంతిని పట్టణంలోని గురువారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు చిట్టెం మాధవరెడ్డి, మల్లికార్జున్, గోపీనాథ్, శివరాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 5గంటలకు ఆలయంలో ఓంకారం, సుప్రభాతం, నగర సంకీర్తన, 8గంటలకు ప్రశాంతి పతాకావిష్కరణ, సామూహిక సత్యసాయి వ్రతాలు, 11గంటలకు రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ, మధ్యాహ్నం అన్నదానం ఉంటుందన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించాలి

నారాయణపేట రూరల్ : విద్యాశాఖలో పనిచేస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగులతోపాటు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించాలని వారు కోరుతున్నారు. ఓపీఓగా వారికి ఎన్నికల విధులు కేటాయించారని, పోలింగ్‌రోజు ఓటువేసుకునే అవకాశం లేకపోవడంతో తమ ఓటుహక్కును కోల్పోవాల్సి వస్తుందని వాపోయారు. మిగిలిన రెండురోజుల్లో ఎన్నికల విధుల్లో ఉండే అన్నిరకాల ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసుకునే సౌకర్యం కల్పించే విధంగా రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ చర్యలు చేపట్టాలని కోరారు.

కొనసాగుతున్న ప్రచారం

మరికల్: బీజేపీ అధికారంలోకి వస్తేనే ప్రజలకు సంక్షేమ పాలన అందుతుందని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు నర్సన్‌గౌడ్ అన్నారు. మరికల్‌లో బుధవారం బీజేపీ పార్టీ అభ్యర్థి రతంగపాండు రెడ్డి, సతీమణి రత్నమాల ఇంటింటి ప్రచారం చేశారు.

- మరికల్‌లో కాంగ్రెస్ అభ్యర్థి పర్ణికారెడ్డిని గెలిపించాలని కాంగ్రెస్ నాయకులు బుధవారం ఇంటింటి ప్రచారం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీ పథకలను అమలు చేస్తుందన్నారు.
- మాగనూర్‌లో మక్తల్ ఎమ్మెల్యేగా చిట్టెం రామ్మోహన్‌రెడ్డిని గెలిపించాలని బుధవారం మండలంలోని ఆయాగ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు.

మార్పునకు శ్రీకారమే బర్రెలక్క

నర్వ: నిరుద్యోగులపై ప్రభుత్వ వైఖరికి నిరసనగా కొల్లాపూర్‌లో బర్రెలక్క పోటీ చేయడం మార్పునకు శ్రీకారమని రైతు చైతన్యవేదిక వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు బంగ్లా సుదర్శన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. మంగళవారం కొల్లాపూర్‌లో ప్రచారం చేసుకుంటుండగా ఆమె కుటుంబ సభ్యులపై దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, ఆమెకు వెంటనే ఎన్నికల కమిషన్ రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

విద్యార్థి అదృశ్యం



మద్దూరు: మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాల చదువుతున్న విద్యార్థి అదృశ్యమైనట్లు బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు. మండలంలోని చెన్నారెడ్డిపల్లికి చెందిన వడ్ల సాయిలు మద్దూరులో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొడుకు శివప్రసాద్ తొమ్మిదోతరగతి చదువుతున్నాడు. మంగళవారం యథావిధిగా పాఠశాలకు వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో బంధువులు, కుటుంబ సభ్యుల వద్ద వాకాబు చేశారు. అచూకి తెలియకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అవినీతి పాలకులను ఇంటికి సాగనంపుదాం



మూలమల్లలో భగత్‌సింగ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వాకిటి శ్రీహరి

ఆత్మకూర్: కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందుతాయని కాంగ్రెస్ పార్టీ మక్తల్ నియోజకవర్గ అభ్యర్థి వాకిటి శ్రీహరి అన్నారు. బుధవారం ఆయన మండలంలోని ఖానాపూర్, మూలమల్ల, జూరాల, గుంటిపల్లి, మోట్లంపల్లిలో ఎన్నికల ప్రచారం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సీతాదయాకర్‌రెడ్డి, నాగరాజుగౌడ్, ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, సిద్ధార్థరెడ్డి, సంజీవ్‌ముదిరాజ్, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

భారీగా చేరికలు

వాకిటి శ్రీహరి సమక్షంలో బీఆర్ఎస్‌కు చెందిన మాజీ ఎంపీటీసీ వెంకటనర్సింగ్‌రావు, సింగిల్‌విండో మాజీ వైస్ చైర్మన్ నారాయణరెడ్డి, ఇతర నాయకులు కాంగ్రెస్‌లో చేరారు.

జోష్ నింపిన హన్మంత్‌రావు

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు హన్మంత్‌రావు మూలమల్లలో జరిగిన ఎన్నికల ప్రచారంలో పాల్గొని కార్యకర్తల్లో జోష్ నింపారు. కాంగ్రెస్ దేశానికి ఏమి చేయలేదని విమర్శిస్తున్న బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు విమర్శలు చేస్తున్నారని, ప్రాజెక్టులు వాళ్ల తాతలు కట్టారా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో నాయకులు గంగాధర్‌గౌడ్, అయూబ్‌ఖాన్, తులసీరాజ్, పరమేష్, నల్గొండ శ్రీను, రహ్మతుల్లా, వినయ్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి ఉన్నారు.

మక్తల్: మండలంలోని జక్లేర్, కాట్రేవ్‌పల్లి, రామసముద్రం, ఏర్నాగన్‌పల్లి తదితర గ్రామాల్లో కాంగ్రెస్ అభ్యర్థి వాకిటి శ్రీహరికి మద్దతుగా జెడ్పీ చైర్‌పర్సన్ వనజమ్మ ప్రచారం చేశారు. అనంతరం పలువురికి కాంగ్రెస్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. మక్తల్ పట్టణంలో వాకిటి శ్రీహరికి మద్దతుగా ఆయన సతీమణి వాకిటి లలిత ఇంటింటి ప్రచారం చేశారు. మండలంలోని సోమేశ్వర్‌బండలో జిల్లా మత్స్యశాఖ చైర్మన్ కోళ్ల వెంకటేష్, కావలి హరి ఆధ్వర్యంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు భారీగా కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి, టీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ చంద్రకాంత్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, గణేష్‌కుమార్, రవికుమార్, చంద్రశేఖర్‌గౌడ్, తాయప్ప పాల్గొన్నారు.

మాగనూర్: మక్తల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వాకిటి శ్రీహరికి మద్దతుగా మండలంలో కాంగ్రెస్ నాయకుల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో పేదలకు సంక్షేమ పథకాలు అందాయని, రాష్ట్రంలో బీఆర్ఎస్, కేంద్రంలో బీజేపీలు పదేళ్లు అధికారంలో ఉండి చేసిందేమి లేదన్నారు.



మాట్లాడుతున్న హన్మంత్‌రావు

అమరచింత: సంక్షేమ పథకాలు ప్రజలందరికీ అందించి దేశ వ్యాప్తంగా పేదరికం నిర్మూలనకు కృషి చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు జుబేర్‌అహ్మద్ అన్నారు. మక్తల్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో ఉన్న వాకిటి శ్రీహరిని గెలిపించాలని కోరుతూ పట్టణంలోని ఆరు, ఏడు వార్డులో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీధర్, మన్నాన్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ అభ్యర్థినే సీఎం చేసుకుందాం



తిప్రాస్‌పల్లిలో మాట్లాడుతున్న మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి

మక్తల్: రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే బీసీ అభ్యర్థిని సీఎంగా చేసుకుందామని బీజేపీ మక్తల్ అభ్యర్థి మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి అన్నారు. ఊట్కూర్ మండలంలోని తిప్రాస్‌పల్లి, బాపురం తదితర గ్రామాల్లో బీజేపీ అభ్యర్థి మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి ప్రచారం ముమ్మరంగా చేస్తున్నారు. గ్రామాల్లో కార్యకర్తలతో కలిసి ఇంటింటా ప్రచారం చేసి కమలం గుర్తుకు ఓటువేయాలని కోరారు. అదేవిధంగా కాట్రేవ్‌పల్లిలో కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తలు దాదాపు 50మంది జలంధర్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మక్తల్ నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగరవేయడం ఖాయమన్నారు. ప్రధాని నరేంద్రమోదీ పథకాలు ప్రతి ఇంటికి చేరుతున్నాయన్నారు. మక్తల్ పట్టణంలో ఆయన సతీమణి పద్మజారెడ్డి ప్రచారం చేస్తున్నారు. హైదరాబాద్‌లో వలస ఓటర్లకు ఆరేపల్లి, గుంటిపల్లి, లంకాల గ్రామాలకు చెందిన వలస ఓటర్లు ఉండటంతో అక్కడ ప్రచారం చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, పేట బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి రతంగ్‌పాండురెడ్డి, రాష్ట్ర నాయకుడు నాగురావునామాజీ, మున్సిపల్ చైర్మన్ పావని, మాగనూర్ ఎంపీపీ శ్యామలమ్మ, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కర్, వైస్ చైర్మన్ అఖిలారెడ్డి, కౌన్సిలర్లు చీరాల సత్యనారాయణ, ప్రసన్నరెడ్డి, అర్చన, కర్ని లక్ష్మి, కౌసల్య, మండల అధ్యక్షుడు లక్ష్మన్, మండల అర్బన్ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ బాల్‌రాంరెడ్డి, జిల్లా కిసాన్ మోర్చా ద్యావరింటి నర్సింహారెడ్డి, నాగప్ప, ఈసరి నాగప్ప, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



ప్రచారంలో పాల్గొన్న పద్మజారెడ్డి

ఏటా జాబ్ క్యాలెండర్



కారు గుర్తుకు ఓటేయ్యాలని చెబుతున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

నారాయణపేట/నారాయణపేట రూరల్/మరికల్: రాష్ట్రంలో సీఎం కేసీఆర్ నేతృత్వంలో మరోసారి బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని... బీఆర్ఎస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం ధన్వాడ మండలం కిష్టాపూర్‌లలో ప్రచారం చేశారు. తనను మరోసారి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. తమ ప్రభుత్వం అమలు చేయనున్న మరిన్ని పథకాలపై వివరించారు. ఏటా ప్రణాళికా బద్ధంగా జాబ్ క్యాలెండర్ అమలు ఉంటుందన్నారు.

ప్రతిపక్షాల మాటలు నమ్మొద్దు

బీజేపీ, కాంగ్రెస్‌ల మాయమాటలను ప్రజల నమ్మొద్దని ఎమ్మెల్యే సతీమణి స్వాతిరెడ్డి ఓటర్లను కోరారు. జిల్లా కేంద్రంలోని 11వ వార్డులో ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే కుమార్తె నందికా రెడ్డి సైతం వార్డుల్లో కార్యకర్తలు, నాయకులతో కలసి ప్రచారంలో పాల్గొన్నారు. తన తండ్రిని గెలిపించాలని కోరారు. నమూనా ఈవీయంతో ప్రజల్లోకి వెళ్లారు. కాంగ్రెస్ వస్తే కరెంట్ కష్టాలు తప్పవని...24 గంటలు ఉచిత విద్యుత్ ఇస్తున్న కేసీఆర్‌ను గెలిపించాలన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గందె అనసూయ, కౌన్సిలర్ బండి రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు

నారాయణపేట పట్టణంలోని ట్రాలీ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో పలువురు డ్రైవర్లు ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. మండలంలోని కొల్లంపల్లి యాదవ సంఘం నాయకులు, అభంగపూర్ కాంగ్రెస్ నాయకులు, శేర్నపల్లి బీజేపీ నాయకులు, ఎక్లాస్‌పూర్, తిలేరు నాయకులు పలువురు బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు.

ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ అమ్మకోళ్ల శ్రీనివాస్‌రెడ్డి, మండల అధ్యక్షుడు వేపూరి రాములు పాల్గొన్నారు.

మరికల్ మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో బుధవారం ఎమ్మెల్యే అభ్యర్థి ఎస్. రాజేందర్‌రెడ్డి తరుపున గెలుపునకు ఇంటింటి ప్రచారం చేశారు. నాయకులు తిరుపతయ్య, రామస్వామి, కృష్ణారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రాములు, రాజేష్ పాల్గొన్నారు.



బీఆర్ఎస్‌లో చేరిన ఆటో డ్రైవర్లు

ముచ్చటగా మూడు పార్టీలు

మండలంలోని పేరపళ్లతండాకు చెందిన ఎంపీటీసీ సభ్యురాలు సావిత్రి ముచ్చటగా మూడు పార్టీలు మారి రికార్డు సృష్టించింది. ముందుగా గత ప్రాదేశిక ఎన్నికల్లో బీజేపీ తరఫున ఎంపీటీసీగా ఎన్నికైన ఈమె.. సీఎం కేసీఆర్ ప్రకటించిన పథకాలకు ఆకర్షితురాలినయ్యా అంటూ నాలుగు రోజుల క్రితం సిట్టింగ్ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి సమక్షంలో భర్తతో కలిసి బీఆర్ఎస్‌లో చేరారు. తాజాగా సోమవారం రాత్రి కారు దిగి హస్తం గూటికి చేరింది. కాంగ్రెస్ అభ్యర్థి ఫర్ని కారెడ్డి సమక్షంలో చేయి కలిపింది.వారంరోజుల్లో మూడు ప్రధాన పార్టీల కండువాలు మార్చుకోవడం పట్ల స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

– నారాయణపేట రూరల్

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప స్వామి మాలధారణ

ఊట్కూర్: మండలంలోని ఈశ్వర్ మందిర్‌లో బుధవారం అయ్యప్పస్వామి మాలధారణ భక్తిశ్రద్ధలతో రఘువీర్ గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తులకు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అయ్యప్ప మాలవేసుకొని దీక్షను స్వీకరించారు. రఘుగురుస్వామి అయ్యప్ప దీక్ష నియమాలను వారికి సూచించారు. కార్యక్రమంలో గురుస్వాములు చంద్రకంటి శ్రీనివాస్, రాముగౌడ్, రాహుల్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పర్యటనను విజయవంతం చేయాలి

కృష్ణా: మంత్రి కేటీఆర్ గురువారం మక్తల్ పట్టణానికి వస్తున్న సందర్భంగా మండలంలోని బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు విజప్పగౌడ్, ఒక ప్రకటనలో కోరారు.

విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన



మహబూబ్‌నగర్‌లో ఓటుహక్కుపై అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్

నర్వ: మండలంలోని ఉందేకోడ్ ఉన్నతపాఠశాలలో విద్యార్థులకు ఓటుహక్కు వినియోగంపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ మేరకు.. వీవీప్యాట్, కంట్రోల్ యూనిట్‌లపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ నెల 30న జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో విద్యార్థులు తమ తల్లిదండ్రులు ఓటుహక్కును ఎలక్ట్రానిక్ యంత్రాలపై వినియోగించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఒక్కరూ ఈ వీవీ ప్యాడ్‌ల ద్వారా ఓటుహక్కును వినియోగంచుకోగా బీప్‌మనే శబ్దం 7సెకన్లపాటు వస్తుందని అప్పుడే ఓటు మీకు నచ్చిన అభ్యర్థికి వెళ్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేష్, ఉపాధ్యాయులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో ఎలక్షన్ వాచ్, ఎలక్ట్రోల్ క్లబ్ ఆధ్వర్యంలో ఓటరు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈమేరకు కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో ఓటు ఎంతో ప్రాముఖ్యత కలిగి ఉందని, దాన్ని సరిగ్గా ప్రతి ఒక్కరు వినియోగించుకుని ఎన్నికల్లో పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ అధికారులు నాగేంద్రస్వామి, బాలయ్య, రమేష్‌చంద్ర, చంద్రకళ, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



నర్వలో అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

రోడ్డు ఇలా..ప్రయాణించేదెలా?



అడవిసత్యరం సమీపంలో రోడ్డుపై కమ్మేసిన కంపచెట్లు

మాగనూర్: మండలంలోని వడ్వాట్ – అడవిసత్యరం గ్రామాలకు వెళ్లేరోడ్డు గుంతలమయంగా మారడంతోపాటు కంపచెట్లతో అధ్వానంగా తయారయ్యాయి. ముఖ్యంగా రోడ్డుకు ఇరువైపుల కంపచెట్లు పెరిగిపోయి రోడ్డును పూర్తిగా కమ్మేశాయి. దీంతో ఎదురుగా వచ్చేవాహనాలు అతి సమీపంలోకి వచ్చేవరకు కనిపించకపోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అమ్మపల్లి గేట్ నుంచి కోల్పూర్ వరకు కంపచెట్లు కుమ్మేయడంతో రోడ్డు మూలమలుపుల వద్ద వాహనదారులు ఎదురెదురుగా వచ్చినప్పుడు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇప్పటికైనా అధికారులు సంబంధిత సందించి రోడ్డుకు ఇరువైపుల పెరిగిన కంపచెట్లను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

మద్యం దుకాణం సీజ్



మక్తల్‌లో వైన్స్‌షాప్‌ను సీజ్‌చేస్తున్న సీఐ

మక్తల్: పట్టణంలోని బుధవారం మారెమ్మ మద్యం దుఖాణాన్ని పేట ఎక్సైజ్ సీఐ కవిత సీజ్‌చేశారు. వైన్స్ షాప్‌లో మద్యాన్ని ఎన్‌సీకోడ్ ప్రకారం కాకుండా అధిక ధరలకు విక్రయించడంతో సీజ్‌చేసినట్లు ఆమె తెలిపారు. ఇష్టానుసారంగా మద్యాన్ని అధిక ధలకు అమ్మకాలు చేపడితే చర్యలు ఉంటాయన్నారు. తనిఖీల్లో ఎస్ఐలు భవాని, సందీప్, సిబ్బంది సూర్యనారాయణ, సంతోష్, గౌష్ ఉన్నారు.

మహిళా డిగ్రీ కళాశాలలో యజ్ఞవల్కజయంతి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో ఘనంగా యజ్ఞవల్క జయంతిని కళాశాల సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేశారు. ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, నరసింహారావు అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

చెరువు కాల్వలో పూడిక, ముళ్లచెట్లు

అమరచింత: 15 ఏళ్ల కిందట అమరచింత పెద్ద చెరువును లిఫ్ట్ నీటితో నింపి ఆయకట్టుకు సాగునీరు అందించాలనే సంకల్పంతో నిర్మించిన చెరువు కాల్వ నేడు పూడుకుపోతున్నా సంబంధిత అధికారులు పట్టించు కోవడం లేదు. అమరచింత లిఫ్ట్ నుంచి పెద్ద చెరువును నీటితో నింపాలని అప్పట్లో ఎంపీ విఠల్‌రావు, ఎమ్మెల్యే స్వర్ణమ్మ నిధుల ద్వారా కాల్వ నిర్మాణ పనులు చేపట్టారు. వీటితో పాటు పనికి ఆహారం పథకం ద్వారా మరోమారు నిధులు మంజూరు కావడంతో పూర్తి స్థాయిలో కాల్వను నిర్మించారు అమరచింత రైతులు, అఖిల పక్ష నాయకులు. కానీ ప్రస్తుతం 12 ఏళ్లుగా లిఫ్ట్ నుంచి చెరువు కాల్వకు సాగునీరు వదలక పోవడం, ఐడీసీని తొలగించి ఇరిగేషన్ శాఖకు అప్పగించడంతో వీటి నిర్వహణ మరిచిపోయారు. దీంతో కాల్వలో భారీ చెట్లతో పాటు ముళ్లపొదలు పెరిగి కాల్వను కమ్ముకున్నాయి.

నాణ్యతకు విరుద్ధంగా నిర్మాణ పనులు

అమరచింత: మస్తీపురం శివారులో అమరచింత మున్సిపాలిటీకి సంబంధించి ఎఫ్ఎస్‌సీపీపీ నిర్మాణ పనులు నాణ్యతకు విరుద్ధంగా కొనసాగుతున్నాయి. వీటి కోసం ప్రభుత్వ పరంగా రూ.35 లక్షలు మంజూరు చేయడంతో రెండు నెలల కిందట టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులను చేపట్టారు. ప్రతినిత్యం మున్సిపల్ ఏఈ పర్యవేక్షణలో పనులు జరగాల్సి ఉండగా.. కేవలం కాంట్రాక్టర్ నియమించుకున్న సూపర్‌వైజర్‌తోనే పనులు చేపడుతున్నారు. నాసిరకం సిమెంటుతో పాటు ఇసుకకు బదులుగా డస్ట్‌ను వినియోగిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. పట్టణంలోని మరుగుదొడ్ల నుంచి వేస్టేజీని తీసుకెళ్లి వాటి ద్వారా ఎరువులను తయారు చేయడానికి వీలుగా నిర్మిస్తున్న పనుల్లో అధికారుల పర్యవేక్షణ లేక నాసిరకంగా పనులు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి పనులు నాణ్యతగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



మస్తీపురం శివారులో నిర్మిస్తున్న ఎఫ్ఎస్ సీపీపీ పనులు